
# గ్యారంటీ కార్డు

— శివల జగన్నాథరావు




"ఎట్లా వున్నదోయ్, స్వరూపా? బావుందా?"

స్వరూప చేతుల్లో వున్న "టూ ఇన్ వన్..." వేపు మరీ మరీ చూడసాగింది. రంగు బావుంది. ఆకారం బావుంది. వెయిట్ కూడా ఫర్వాలేదు! ఒకసారి ఆన్‌చేసి చూసింది. శబ్దం సంతృప్తిగా అనిపించింది.

ధనిష్ట ఇబ్బందిగా అయ్యాడు. "నిన్ను చూస్తే ఒళ్ళు మండుతుందోయ్" అన్నాడు. "... ఆఖరికి పోపు సామాను జీలకర్ర తెచ్చినా నువ్వు దానికి అరవయ్యారు అర్థతల్పు ఎంచుతావు!?" అన్నాడు కోపంతో. స్వరూప నవ్వేస్తూ, "అదేం మాటండీ! డబ్బు ఇచ్చీ కొనుక్కున్న వస్తువు మంచిదీ, మన్నికయినదీ చూస్కోవద్దూ? మీరు మరీనూ... ఆ అన్నట్టు దీనికి వాడు గ్యారంటీ కార్డు ఇచ్చేడా? ఏదీ? చూపించండి." అంది.

ధనిష్ట వెర్రిమొహం వేశాడు. "గ్యారంటీ కార్డా? వాడివ్వలేదే!" అని చెప్పాడు.

"అదేవిటి? మీరగలేదా గ్యారంటీ కార్డు?"

"అదేమో? మరి.. అడగలేదే!" మూలిగాడు.

"ఎందుకడగలేదు? ఇంతకు ముందు మీరిట్లాగే చేశారు? బీర్వా తెచ్చీ, దానితో పాటు టేబుల్ ఫాను తెచ్చారా? గ్యారంటీ కార్డు లేకపోతే నేనప్పుడు వెంటబెడ్తే పరిగెత్తి తెచ్చేరు..."

ధనిష్ట భార్య బాధపడలేక అరగంట సేపట్లో ఆ గ్యారంటీ కార్డు తెచ్చేసేడు.

అతను భార్య ముఖంలో ఒక గర్వపు నవ్వు చూసి, గతంలోకి వెళ్ళాడు...

.........

"ఎట్లావుంది అమ్మాయి?"

ధనిష్ట తన అభిప్రాయం అర క్షణంలో చెప్పేశాడు తన మామగారికి. అతన్ని ఆమె రూపం ఆకర్షించింది ఆమె అంతస్థు సంతృప్తి పరచింది. వాళ్ళు అతడి కంటే ఎక్కువ స్థోమత గల వాళ్ళని తేల్చింది. "అరవయ్ లక్షల రూపాయల్తో మిమ్మల్ని కొనుక్కుంటున్నా! కనుక మీరు "గ్యారంటీ కార్డు" తీసుకువచ్చీ, నాకు ఇవ్వాలి! తప్పదు మరి..." అని చెప్పింది స్వరూప. ధనిష్ట ఆశ్చర్యపోయాడు. "అదేంటి? గ్యారంటీ కార్డు? నేనేం వస్తువునా?" అనడిగాడు కోపం ఒచ్చి.

స్వరూప అతనికి "గ్యారంటీ కార్డు" గురించీ వివరణ ఇచ్చిందప్పుడు. ఆమె స్నేహితురాళ్ళు, కాలేజీ చదువులయిపోయి, వైవాహిక జీవితంలో అడుగు పెట్టబోయే అమ్మాయిలు, ముప్పయి మంది వరకు, ఒక ప్రత్యేక సంఘంగా ఏర్పడ్డారని చెప్పింది. వాళ్ళు తాము చేస్కోబోయే భర్తల ద్వారా "గ్యారంటీ కార్డులు" పొందితే తప్ప, మెళ్ళో పుస్తేలు కట్టించుకోరని ప్రతిజ్ఞలు చేసుకున్నారు. వెయ్యి నూట పదహార్లిచ్చి అమ్మాయికి అయినా ఆ మొగుడు గ్యారంటీ కార్డు ఇవ్వాల్సిందే! ఆ కార్డు ఒక హామీ! ఆ వూర్కి మేయర్, కలెక్టర్ ఆ కార్డుమీద సంతకం పెడతారు. స్టాంపులు వేస్తారు! "హోరి బాబో" అనరిచేడు ధనిష్ట

"ఇదేదో వనితా విప్లవంలా వుందే!" అన్నాడు తెల్లబోయి.

"విప్లవం ఏమిటి? ఆ కార్డు మేం మీనించి తీసుకోకుంటే, మరి మా భార్యల బ్రతుకులికి గ్యారంటీ ఏమిటి?"

"అంటే... ఏవిటి నీ మాట?" అతనికేం బోధపడలేదు.

"తీరా, పెళ్ళి చేస్కుని, మీరు మమ్మల్ని కిర్సనాయిల్తో కాల్చీ చంపేస్తే?"

అతను త్రుళ్ళిపడ్డాడు.

"ఏంటి గ్యారంటీ?"

"ఏ అరబ్బుగాడికో తీసుకెళ్ళి అమ్మేస్తే...?"

అతను బాంబు పడ్డట్టూ భయపడ్డాడు.

"ఏంటి గ్యారంటీ?"

అతను ఒణికేడో నిమిషం.

"నీ కిట్లాంటి భయంకర భావలొస్తున్నాయేంటి, స్వరూపా?" నీర్సం అయిపోయి అడిగాడు తను.

"నా భావాలెందుకు భయంకరం అయ్యేయి? చుట్టురా ఎంతమంది ఈ విధంగా భయంకరంగా ప్రవర్తించడం లేదు? చెప్పండి? మీరు పేపర్చూస్తున్నారా?"

"ఆ..."

"అటువంటి విషయాలు విన్నారా?"

"విన్నాను"

"మరయితే, ఏం ఎరగనట్టు ఏంటా ఫోజూ?"

"ఇదుగో నన్ను ఆ విలన్ వెధవల్తో జమ కట్టేయకు? చాలా అన్యాయం? నేను చ్ఛాలా మంచివాణ్ణి!"

"మంచివాళ్ళా? అయితే అట్లా రాసీ, భార్యని ఏ విధంగాను బాధించనని రాసీ, సంతకం పెట్టి, ఆపైన మా సంఘం సూచించిన మేరకు మేయర్ వాళ్ళ చేత సంతకాలవీ తీస్కుని కార్డు తెచ్చి ఇవ్వండి మరి..."

ధనిష్టకి తిక్కరేగింది. రేగిపోలేదు. కానీ స్వరూప అందం ఆ తిక్కని అణిచేయసాగింది. లాభం లేదు! ఈమెగారితో సొల్లేదు! చచ్చినట్టూ ఆ కార్డు తయారుచేసి, ఇచ్చుకోవాల్సిందే! ఇచ్చుకున్నాడు.

ఇచ్చుకుంటూ అన్నాడిలా! "ఇప్పడయినా ఓ.కే.నా?"

స్వరూప నవ్వేసింది! "వెన్నెల నవ్విందిప్పుడు" అన్నాడతను.

'మరయితే, పూర్వం...?"

"అప్పుడా?" అని బుర్ర గోక్కుని "ఏం చెప్తే దబ్బా?" అని, "అమావాస్య ఏడ్చింది..." అన్నాడు.

ఇద్దరూ గలగలా సెలయేర్లా నవ్వుకున్నారు.

** ** **

స్వరూప స్నేహితురాలు రేవతి ఆ కబురు చెప్పి, స్వరూపకి మతిపోగొట్టిందో అయిదు నిమిషాల పాటు.

రేవతికో సంబంధం వచ్చింది! అతను ఇంజనీరు! ఫారిన్ వెళ్ళే ఛాన్స్ కూడా వుందట! రేవతీ వాళ్ళు, స్వరూప వాళ్ళకంటే ఎక్కువ ధనవంతులే! "రెండు కోట్లు!..." చెప్పిందామె గర్వంగా.

"చాలా బావుందిలే! అంత గొప్పలేద్దూ...?" జ్ఞాపకం చేసింది స్వరూప.

"నేనేం మరిచిపోలేదే తల్లీ! మన సంఘం వాళ్ళనుకున్న రూల్సు పాటించమా?"

'అసలీ కట్నాలు మాత్రం ఎందుకే, మనం ఇస్తోన్నట్లు?"

"ఎక్కడిచ్చేం? కట్నం. మన పేరనే బ్యాంకు కెళ్తుంది గదా? ఆ రూలు కూడా వున్నదే గదా? మరిచిపోయేవేంటీ?"

అవునవును... అట్లా ఒప్పకున్నోడే మొగుడవుతాడనీ!"

రేవతి చెప్పింది అంతదాకా సరిగ్గా వెళ్ళింది. కానీ–

ఆమె కాబోయే భర్తగారూ, మామగారూ, అత్తగారూ భరతనాట్యం, కధాకళీ చేసేసేరు!!

"ఏమిటి? ఏమిటీ వేషాలు?"

"గ్యారంటీ ఏవిటి? కార్డులేమిటి?!"

"రేషను కార్డుల్లాగానూ?! ఇదేం బావులేదు! చ్ఛాలా అసయ్యంగా వున్నది మాకు"

"మాకేం అసయ్యంగా లేదండీ"

"అవమానంగా వున్నది..."

"మాకేం అవమానంగా లేదండీ"

రేవతి, ఆమెకి సాయంగా వెళ్ళిన స్వరూప ఎంతగా చెప్పినా, "వాళ్ళు" గెంతడం మానలేదు.

రేవతి, స్వరూప వాళ్ళ "గ్యారంటీ కార్డుల" సంఘం తరఫున ఒక స్టేజీ డ్రామా వేశారు. ఆ వారంలో! నలుగురమ్మాయిలు నటించేరందులో. పెళ్ళి కూతురిని, ఆ భర్త, మామ, అత్త ముగ్గురూ విలన్లలా బాధలు పెట్టి, ఎవరి ద్వారానో గల్ఫ్ కంట్రీకి పంపివేయడం ఆ కధాంశం... చాలా సహజంగా సాగింది నాటిక. రేవతి తన కాబోయే భర్తని ఆ నాటిక చూడ్డానికాహ్వానించింది. ఆ నాటికలో పెళ్ళికూతురుగా అద్భుతంగా నటించిన అమ్మాయి, రేవతి రెండు కోట్ల మొగుడికి చెల్లెలే అని, అతడికి తెలిసిపోయింది. ఆ అమ్మాయికింకా వివాహం కాలేదు. ఆ పిల్లకూడా, స్వరూప గ్యారంటీ కార్డుల సంఘంలో సభ్యురాలని, వాళ్ళన్నగారికి ఆ నాటిక చూసేవరకు తెలియదు.

రేవతి తనకి చెప్పిన రూల్స్ ప్రకారం గ్యారంటీ కార్డు తీసుకువచ్చీ, ఆమెకి ఇచ్చాడు అతను.

ఆ మాసంలోనే, రేవతి, స్వరూపావాళ్ళ "గ్యారంటీ కార్డు" సంఘంలో, మరో నలుగురమ్మాయిలు వివాహం, వారి సంఘం రూల్స్, రెగ్యులేషన్సు మేరకు వరస వరసగా నాలుగు గంటల రోజుల తేడాతో జరిగిపోతుంది.

## దాసుగారి 'చురకలు'

విజయనగరం అంటే హరికథలకు మారుపేరు అనుకోవచ్చును. ఆదిభట్ల నారాయణదాసుగారు పితామహులు. పెమ్మరాజు రాజగోపాలరావుగారు, చౌప్పెల దాసుగారు, కోటేశ్వరరావు గారు, జలుమూరి కృష్ణ గారు అప్పట్లో హరికథలు విరివిగా ప్రతి పేటలో – ఏకరాత్రి నుంచి 40 రోజుల వరకూ భారత – భాగవత – రామాయణ కథల్ని ఎన్నుకొని హరికథా గానం చేసేవారు.

'దొడ్డమ్మ' దాసుగారని ప్రసిద్ధి పొందిన హాస్య హరికథా భాగవతార్‌గారు హరికథల్లో ఆడవారిని అనుకరిస్తూ, వారిపై ఛలోక్తులు విసిరేవారు. వారి అసలు పేరు ఎవ్వరూ గుర్తు వుంచుకొనే వారు కాదు. వారు ప్రహ్లాద చరిత్ర – విష్ణుభక్తి – ముక్తికి మార్గం కథను చిన్న ఆంజనేయస్వామి వారి కోవెల ('గుంటీ' అంటారు) కూడలి స్థానంలో చెప్తున్నారు. రాత్రి 10 – 10.30 ప్రాంతం. హరికథ జోరుగా సాగుతున్నది. అన్ని రోడ్లు భక్తు జనంతో క్రిక్కిరిసి గట్లు, పావంచాలు, రోడ్లమీద తివాసీలు, దరీలు, తువ్వాళ్ళు, దుపట్లూ పరుచుకొని ఎవరికి వారు తెచ్చుకున్న వాటిపై కూర్చుని కథ వింటున్నారు.

దానన్నపేట ప్రాంతంలో వున్న 'ప్రభాత్ టాకీసు' (ఆ కాలంలో ఆ హాలు పేరు)లో 'జీవితం' సినిమా నడుస్తున్నది.

సినిమా నుంచి వారి వారి ఇళ్ళకి గుంటీ మీదుగా వెళ్ళే వారు. రిక్షాలలోనూ, కార్లలోనూ వెళ్ళేవారి కోసం జనంలో అలజడి, కథలో అంతరాయం కలిగేది. 'దొడ్డమ్మ' దాసుగారు వారిని ఉద్దేశించి, వ్యంగ్యంగా "మీ జీవితాలు అయిపోయేయా?" అని చిన్న పాట ఊహించి, అప్పటికప్పుడే వరుసకట్టి పాడేవారు.

ప్రహ్లాదుడు తండ్రిని ఉద్దేశించి, హరిభక్తి చెప్తున్న ఘట్టంలో సినిమా జనం రాకపోకలు చూసి, దాసుగారు ప్రశస్తమైన హరికథను కాదని సినిమాకు పోయి కాలం వ్యర్థంచేసి, 'జీవితం' సమాప్తం చేసుకుంటున్నారన్న భావన సునాయాసంగా కలిగించేవారు. కొందరు సిగ్గుపడేవారు. ఇంకా కొందరు దారి మళ్ళి, వెనుక వైపు నుంచి వారి ఇళ్ళకు చేరుకొనేవారు.

అలాగే జలుమూరి కృష్ణమూర్తి గారి హరికథ జరుగుతున్నప్పుడు ఎవరేనా కారులో ఆ దారిన వెళ్ళి అక్కడ అంతరాయం కలిగించినా, కారు ధూళి రేగితే వెంటనే ఒక పాట కట్టి.

"మీ కారులు రేపిన ధూళీ దుమ్మే
మా మొహానికి చందన పొడరు,
ఇంకెన్నాళ్ళో సాగదు దొరలూ,
ఇకనైనా దిగుతారా బాబులు"... అని ఆశుకవిత్వంగా పద్యాలు, గేయాలు, పాటలు అప్పటికప్పుడు కట్టి, మెత్త మెత్తగా చీవాట్లు పెట్టేవారు.

–రుద్రావఝల రామకృష్ణారావు